క్లుప్తంగా

మంగళగౌరీగా కనకమహాలక్ష్మీ అమ్మవారు



నగరంపాలెం: స్థానిక సిద్ధార్థనగర్ 11వ వీధిలోని శ్రీకనకమహాలక్ష్మీ మందిరంలో మంగళవారం శ్రావణ మాస విశేష కుంకుమార్చనలు జరిగాయి. అమ్మవారిని మంగళగౌరీగా అలకరించారు. పండితుల వేదమంత్రాల నడుమ అమ్మవారికి శ్రావణ మంగళవారం పూజ, కుంకుమార్చనలు విశేషంగా నిర్వహించారు. ప్రత్యేక హారతి, మంత్రపుష్పం అనంతరం భక్తులు, మహిళలకు తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమాలను వ్యవస్థాపకులు ఘంటసాల విజయస్వామి పర్యవేక్షించారు.

వైభవంగా అమ్మవార్లకు లక్ష విరజాజుల అభిషేకార్చన



నగరంపాలెం: స్థానిక అరండల్‌పేట 4 /4వ అడ్డరోడ్డులోని శ్రీఅష్టలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనారాయణస్వామివారి 30వ కోటి కుంకుమార్చన ఉత్సవాల్లో భాగంగా తొలి మంగళవారం అమ్మవారికి లక్ష విరజాజులతో అభిషేకార్చన నిర్వహించారు. అమ్మవారికి లవంగాలు, యాలుకాయలు, సంపెంగలు, పసుపు కొమ్ముల మాలలను అమ్మవారికి సమర్పించారు. తొలుత గోపూజ, గణపతి పూజ, శ్రీచక్ర మహా మేరుకు విశేష అభిషేకార్చనలు జరిగాయి. మహా హారతి, నక్షత్ర హారతితో పాటు విశేష హారతులతో అమ్మవారిని పూజించారు. కోటి కుంకుమార్చనలో సుమారు 200 మంది సువాసినులు పాల్గొనగా, భక్తులకు తీర్థ, అన్న ప్రసాదాల వితరణ చేశారు. ఆలయ ప్రధానార్చకులు మర్రిపాటి ప్రసాద్‌శర్మ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

తైక్వాండో పోటీల్లో స్టెమ్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: తైక్వాండో పోటీల్లో స్టెమ్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ ఫాదర్ భరత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్లో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లోని ఐసీఎస్ఈ పాఠశాలల విద్యార్థులకు సోమవారం నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపారు. మంగళవారం విద్యానగర్‌లోని స్టెమ్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో భరత్‌రెడ్డి మాట్లాడుతూ అండర్–14, 17 విభాగాల్లో షేక్ అబ్దుల్ రెహమ్మన్, సీహెచ్ బాజీ, షేక్ సన తస్లీమ్, ఎం.హేమన్యరెడ్డి బంగారు పతకాలను కైవసం చేసుకున్నారని తెలిపారు. అదే విధంగా అండర్–17 విభాగంలో బి.అభిరామ్, షేక్ అబ్దుల్ లుక్మాన్, అండర్–14 విభాగంలో పి. మోక్షిత రజత పతకాలు సాధించారని తెలిపారు. ఈసందర్భంగా తమ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ అనుపమ, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

సాయిప్రియ చిట్‌ఫండ్ అధినేత యడ్ల మృతి



యడ్ల సాంబశివరావు (ఫైల్)

నగరంపాలెం: సాయి ప్రియ చిట్‌ఫండ్ సంస్థ అధినేత యడ్ల సాంబశివరావు(75) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఆయనకు భార్య నాగమధురలాలస, కుమార్తెలు నీలిమాచౌదరి, నిరుపమచౌదరి సంతానం. జనచైతన్య గ్రూప్ సంస్థ డైరెక్టర్ దివంగత మాదల శకుంతలకు ఆయన నాలుగో సోదరుడు. సాంబశివరావు అంత్యక్రియలు బుధవారం ఉదయం పది గంటలకు నవభారత్‌నగర్ 4/2వ అడ్డరోడ్డులోని ఆయన నివాసం నుంచి బయలుదేరి స్తంభాలగరువు మహాప్రస్థానంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక వసతులు కల్పించాలి

నెహ్రూనగర్: నగరంలోని టిడ్కో గృహ సముదాయాల వద్ద మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో టిడ్కో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అడవితక్కెళ్లపాడు, వెంగళాయపాలెంలోని టిడ్కో ఇళ్లల్లో నివాసం ఉంటున్న ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో టిడ్కో ఎస్ఈ ఉమామహేశ్వర శాస్త్రి, ఉపా సెల్ పీఓ జె.రామారావు, టిడ్కో డీఈఈ సేతుబాబు, టిడ్కో కోఆర్డినేటర్ సుధాకర్, ఏఈ వేణు పాల్గొన్నారు.

వెన్నుపోటు.. వంచన కలిస్తే చంద్రబాబు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మోదుగుల

పట్నంబజారు: వెన్నుపోటు, వంచన కలిస్తే.. వాటికి నిలువెత్తు రూపం చంద్రబాబు అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు విమర్శించారు. పశ్చిమ నియోజకవర్గంలోని 32వ డివిజన్ బ్రాడీపేటలో కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ కేవలం అధికారం కోసం గడ్డికరిచి.. పేద, మధ్యతరగతి ప్రజలను దగా చేసి వ్యక్తి చంద్రబాబు అని ధ్వజమెత్తారు. సూపర్‌సిక్స్ అంటూ ప్రజలకు నోటికొచ్చినట్లు వాగ్దానాలనిచ్చి.. చివరకు వాటిని విస్మరించి, దుష్టపాలన చేస్తున్నారని మండిపడ్డారు. కనీసం ఏ మాత్రం ప్రజలను పట్టించుకోకుండా, ఇదేమని ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టి, భయభ్రాంతులకు గురి చేసే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కచ్చితంగా ప్రజలు ఇంతకు ఇంత బదులు తీర్చుకునే సమయం వస్తుందని హెచ్చరించారు. ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ నీతి, నిజాయతీలు లేని దుర్మార్గ పాలన రాష్ట్రంలో కొనసాగుతోందని పేర్కొన్నారు. చంద్రబాబు మోసం చేయటం వెన్నతో పెట్టిన విద్య అని దుయ్యబట్టారు. నలభై ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు ఒక్క సంక్షేమ పథకమైనా తాను ప్రవేశపెట్టానని చెప్పుకోగలడా..? అని ప్రశ్నించారు. ప్రజలు మార్పు కోసం ఎదురు చూస్తున్నారని, కూటమి డ్రామాలకు తెరపడటం తథ్యమని చెప్పారు. పార్టీ గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలు నెరవేర్చే వ్యక్తి వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఇచ్చిన ప్రతి మాటను మరిచిపోయే వ్యక్తి చంద్రబాబు అని మండిపడ్డారు. ఏదైనా పర్యటనకు చంద్రబాబు వెళితే.. కనీసం పది మంది వచ్చే పరిస్థితి లేకుండా పోయింది అంటే.. ఎంతటి వ్యతిరేకత మూటగట్టుకున్నారో అర్థమవుతోందని చెప్పారు. ప్రజల పక్షాన ఎంతటి పోరాటానికి వెనుకాడని.. వైఎస్ జగన్‌కు ప్రజల అండగా నిలబడుతున్నారన్నారు. సమావేశంలో భాగంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన కార్యక్రమాన్ని ఏ విధంగా ప్రజల్లోకి తీసుకుని వెళ్ళాలి.. స్కానర్‌లు చూపించి ఏ విధంగా ప్రజలకు కూటమి కుట్రలు తెలియజెప్పాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు మందపాటి శేషగిరిరావు, వెలుగూరి రత్నప్రసాద్, బత్తుల దేవా, బందా రవీంద్ర, శ్రీనివాసరావు, శారదా, విజయమాధవి, కార్పొరేటర్లు పడాల సుబ్బారెడ్డి, అచ్చాల వెంకటరెడ్డి, షేక్ రోషన్, బోడపాటి కిషోర్, వంశీ పాల్గొన్నారు.

అనుబంధ విభాగ కమిటీలు ఏర్పాటు చేయాలి

డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు



డైమండ్‌బాబుకు విన్నవిస్తున్న మస్తాన్‌వలి పార్టీ నేతలు

పట్నంబజారు: ఏ రాజకీయ పార్టీకైనా అనుబంధ విభాగాలే పట్టుగొమ్మలని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు(డైమండ్ బాబు) పేర్కొన్నారు. గుంటూరు నగరంలోని ఆయన కార్యాలయంలో మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, డైమండ్ బాబును కలిసి చర్చించారు. ఈ సందర్భంగా డైమండ్‌బాబు మాట్లాడుతూ పార్టీ జెండాను భుజాకెత్తుకుని పాటుపడిన ప్రతి ఒక్కరికి సముచితస్థానం దక్కేలా అనుబంధ విభాగాల కమిటీల ఏర్పాటు ఉంటుందన్నారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకి ప్రాధాన్యతనిచ్చేలా కమిటీలు ఏర్పాటు చేస్తామని వివరించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ త్వరితగతిన కమిటీలు పూర్తి చేయాలని డైమండ్ బాబుకు విన్నవించటం జరిగిందన్నారు. అనుబంధ విభాగాల ఏర్పాటు ద్వారా పార్టీ మరింత బలోపేతం కానుందన్నారు.

సాహితీ శిఖరం సినారే



సాహితీవేత్త సి.నారాయణరెడ్డి చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పిస్తున్న దృశ్యం

లక్ష్మీపురం: సాహితీ శిఖరం, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసి గొప్ప పరిశోధకుడు డాక్టర్ సి.నారాయణరెడ్డి అని సాహితీవేత్త ముప్పాళ్ల వి.ఎస్.ప్రసాదరావు అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సాహితీవేత్త సి.నారాయణరెడ్డి జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. ప్రసాదరావు మాట్లాడుతూ సాహితీ ప్రియులందరికీ సినారెగా సుపరచితుడైన సి.నారాయణరెడ్డి తెలుగు సాహిత్యమేకాదు, యావత్తు భారతీయ సాహిత్యం గర్వించదగ్గ సాహితీ మూర్తి అన్నారు. కవయిత్రి పింగళి భాగ్యలక్ష్మి, కవి బండికల్లు జమదగ్ని మాట్లాడుతూ కవితా పఠనం చేస్తే సినారె లాగా చేయాలని చాలా మంది అంటారని అన్నారు. అటువంటి మహనీయుడి ఆదర్శాలకు, ఆశయాలకు అనుగుణంగా సాహితీవేత్తలు వ్యవహరించాల్సిందిగా కోరారు. అనంతరం సంస్థ సభ్యులు తదితరులు నివాళులర్పించారు.

జనసేనలో గుర్తింపు లేదు

మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య

గుంటూరు ఎడ్యుకేషన్: జనసేనలో కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వకుండా వాళ్ల ఇంట్లో పని చేస్తున్న డ్రైవర్లకు పదవులు ఇవ్వడం తగదని జనసేన పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య పేర్కొన్నారు. కొంత మంది జనసేన పార్టీని ఎదగకుండా చేస్తున్నారని ఆరోపించారు. మంగళవారం గుంటూరులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో పొన్నూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి జనసేనలోని కింది స్థాయి నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని టీడీపీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రను ఉద్దేశించి ఆరోపించారు. బర్నాబాస్ హత్య కేసులో తన ప్రమేయం లేదన్నారు.

పేదల నివాసాలను కూల్చడం దారుణం



లక్ష్మీపురం: నెహ్రూ నగర్ ప్రాంతంలోని మోతీలాల్ నగర్లో పేదల నివాసాలను కూల్చడం అత్యంత దారుణమని సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్‌కుమార్ అన్నారు. మంగళవారం బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ నిర్మాణానికి అడ్డు వస్తున్నాయని ఒక మీటర్ వరకు దొడ్లు తొలగిస్తామని చెప్పి ఇప్పుడు పూర్తిగా ఇళ్లను కూల్చడం కుట్రపూరిత చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వ అధికారుల నీచ బుద్ధికి నిదర్శనమన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోటా మాల్యాద్రి మాట్లాడుతూ ఇళ్లను కూల్చివేస్తే సహించేది లేదని ఇళ్లను కూల్చే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు.రావుల అంజిబాబు, జంగాల చైతన్య, నూతలపాటి చిన్న, సిపిఐ నాయకులు శ్రీనాథ్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

లక్ష్మీపురం: గుంటూరు లాడ్జిసెంటర్ వద్ద ఓ గుర్తు తెలియని వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందటంతో అరండల్‌పేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. లాడ్జిసెంటర్‌లోని ఏఈఎల్‌సీ చర్చి వద్ద ఓ గుర్తు తెలియని వృద్ధుడు(70) భిక్షాటన చేసుకుంటూ మంగళవారం సాయంత్రం అక్కడిక్కడే మృతిచెందాడు. దీంతో స్థానికులు అరండల్‌పేట పోలీసులకు సమాచారం తెలియజేయగా పోలీసులు ఘటనా స్థలంలో మృతి చెందిన వృద్ధుడు గురించి విచారించగా ఎలాంటా ఆచూకి తెలియదు. స్థానికంగా చుట్టు పక్కల వారందరూ సత్యనారాయణ, చంటి, సత్యం అంటూ పిలుస్తుంటారని మృతుడు దేవాలయాల వద్ద, చర్చిల వద్ద భిక్షాటన చేసుకుంటూ ఉంటారని చెప్పారు. దీంతో పోలీసులు గుర్తు తెలియని మృతిగా కేసు నమోదు చేసి మృత దేహాన్ని కోవిడ్ ఫైటర్స్‌కు దహన సంస్కారాలకు అప్పగించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటిపాడు: 33 కేవీ ఆర్టీసీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైనుల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్ శాఖ గుంటూరు–4 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పిహెచ్ ఖాన్ మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు. యానాది కాలనీ, దుర్గానగర్, ముగ్దుంనగర్, గొలుసు కొండలరావునగర్, సత్యనారాయణ స్వామి టెంపుల్, యాదవుల బజార్, బాలాజీనగర్, కొండయ్య కాలనీ, ఎల్‌బీనగర్, వినోభానగర్, మారుతీనగర్, జాకీ విద్యనగర్, క్రిస్టియన్‌పేట, శివాలయం టెంపుల్, బీఆర్ స్టేడియం తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్థిక రంగాభివృద్ధిలో సీఏల పాత్ర కీలకం

ఎమ్మెల్యే నసీర్ అహ్మద్



సదస్సు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ ఆర్థిక రంగాభివృద్ధిలో చార్టర్డ్ అకౌంటెంట్లు కీలక పాత్ర పోషిస్తున్నారని తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. శ్రీనివాసరావుతోటలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) గుంటూరు బ్రాంచ్ ఆధ్వర్యంలో జీఎస్టీపై ఒక్కరోజు సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ ఆర్థిక రంగంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి సీఏల కీలక పాత్ర వహిస్తున్నారని, భారత్‌ను ప్రపంచ ఆర్థికంగా నాలుగో స్థానం వరకు తీసుకెళ్ళడంలో వారి సేవలు మరుపరానివని అన్నారు. ఐసీఏఐ నూతనంగా రూపొందించిన సిలబస్ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండి విద్యార్థులకు విస్తృత అవకాశాలను కల్పిస్తుందని పేర్కొన్నారు. జీఎస్టీ, ఇన్‌కం ట్యాక్స్, టెక్నాలజీ వంటి ముఖ్యాంశాల్లో సీఏలకు అవగాహన పెంచేందుకు ఇటువంటి సదస్సులు దోహదపడతాయని తెలిపారు. ఎస్ఐఆర్‌సీ ఉపాధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ జీఎస్టీ వసూళ్లలో సీఏల పాత్ర కీలకమన్నారు. ఆర్థిక రంగానికి సంబంధించిన అంశాలపై సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పుల నేపథ్యంలో సీఏలకు అవగాహన కలిగించేందుకు సదస్సు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా సీఏలు టి.భాను పృథ్వీరాజ్, గుగ్గిలం పవన్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సదస్సులో ఐసీఏఐ గుంటూరు శాఖ చైర్మన్ చింతా రఘునందన్, వైస్ చైర్మన్ భరద్వాజ్ రుద్రవరపు, కార్యదర్శి వనిమిరెడ్డి వెంకట నరేష్, కోశాధికారి కన్నెగంటి మృత్యుంజయరావు, సికాసా చైర్మన్ నాగబీరు రాజశేఖర్, కమిటీ సభ్యులు షేక్ బాజీ, దేసు సంపత్ పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల పరిస్థితి అగమ్యగోచరం



దరఖాస్తుల స్వీకరణ ఏర్పాటు చేసిన కౌంటర్‌ను పరిశీలిస్తున్న ఉపా సెల్ పీఓ రామారావు

నెహ్రూనగర్: నగరంలో వీధులు వెంట వ్యాపారాలు చేసుకునే వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నగరంలో సుమారు 30వేలకు పైగా వీధి వ్యాపారులు ఉన్నారు. గతంలో వీధి వ్యాపారులకు ఇచ్చిన గుర్తింపు కార్డులను కొంత మంది దుర్వినియోగం చేశారనే కారణంతో కమిషనర్ పులి శ్రీనివాసులు తిరిగి కొత్తగా ఐడీ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కాని ఇంత వరకు ఐడీ కార్డులు ఇవ్వకపోగా సచివాలయం వారీగా సెక్రటరీలు తిరిగి సర్వే చేయాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలో కేవలం 20,768 మంది మాత్రమే ఉన్నారని.. ప్రస్తుతం సర్వే పూర్తి చేసింది కేవలం 15,210 మంది మాత్రమేనన్నారు. మిగిలిన వారంతా ఇళ్లల్లో టైలరింగ్ చేసుకునే వారు, ఇతర వ్యాపారాలు చేసుకునే వారని లెక్క కడుతున్నారు. ఈ నెల 21 నుంచి 25వ వరకు దరఖాస్తుల స్వీకరించారు. అవగాహన లేకపోవడంతో అతి తక్కువ మంది దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.

స్ట్రీట్ వెండింగ్ పాలసీతో అందరికి మేలు..!

నగరపాలక సంస్థ పరిధిలో మూడు జోన్లుగా పట్టణ ప్రణాళిక అధికారులు ఏర్పాటు చేశారు. రెడ్‌జోన్ పరిధి మినహా గ్రీన్ జోన్ పరిధి, అంబర్ జోన్ పరిధిలో వ్యాపారం చేసుకునే వారికి గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు గత ప్రభుత్వ హయాంలోనే కార్యచరణ సిద్ధం చేశారు. అయితే 2022లో స్ట్రీట్ వెండింగ్ పాలసీపై కొంత మంది కోర్టును ఆశ్రయించడంతో ఆశీలు వసూలు చేయకూడదని స్పష్టం చేయడంతో ఆశీలు వసూలు చేయకుండా నగరపాలక సంస్థ నిలిపివేసింది. దీంతో రూ.3 కోట్లు దాకా కార్పొరేషన్ ఆదాయానికి నష్టం జరిగింది. స్ట్రీట్ వెండింగ్ పాలసీ అమలయ్యే వరకు ఆశీలు వసూలు చేసే కార్యక్రమంపై నగరపాలక సంస్థ దృష్టి సారిస్తే కార్పొరేషన్‌కు కొన్ని కోట్ల రూపాయలు ఆదాయం సమాకూరుతుంది. అటు ఆ విషయంపై దృష్టి సారించక.. ఇటు స్ట్రీట్ వెండింగ్ పాలసీపై స్పష్టత ఇవ్వకుండా ప్రస్తుతం వ్యాపారం చేసుకునే వారిని ఇబ్బందులకు గురి చేయడం ఎంత వరకు సమంజసం అని వీధి వ్యాపారులు వాపోతున్నారు.

సమగ్రశిక్ష ఆధ్వర్యంలో వైకల్య నిర్ధారణ శిబిరం



గుంటూరు ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష గుంటూరు జిల్లా సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం బ్రాడీపేటలోని జిల్లా వనరుల కేంద్రంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ప్రత్యేక అవసరాల పిల్లలకి ఉపకరణాల కోసం వైకల్య నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పద్మావతి మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 105 మంది పిల్లలను వెంటపెట్టుకుని తల్లిదండ్రులు శిబిరంలో పాల్గొన్నట్లు తెలిపారు. ఈసందర్భంగా అలిన్కో సంబంధించిన సాంకేతిక బృందం శిబిరానికి వచ్చిన చిన్నారులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన ఉపకరణాలను సూచించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా సహిత విద్యా విభాగం సమన్వయకర్త ఎన్. శ్రీనివాసరావు, ఏఎంఓ రమ్య, అసిస్టెంట్ జీసీడీవో సుజాత, సీఎంఓ అనిల్ పాల్గొన్నారు.

కిట్స్ కళాశాలకు ఎన్‌బీఏ టైర్ వన్ గుర్తింపు



మాట్లాడుతున్న కిట్స్ కళాశాల చైర్మన్ సుబ్బారావు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు టైర్ వన్‌లో నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్ గుర్తింపు లభించినట్లు కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు తెలిపారు. స్థానిక కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో సోమవారం చైర్మన్ మాట్లాడారు. అర్హత ఉన్న అన్ని బ్రాంచీలకు (సీఎస్ఈ, ఐటీ, ఈసీఈ, ఈఈఈ) గుర్తింపు లభించిందన్నారు. కళాశాల స్థాపించిన నాటి నుంచి ఇప్పటి వరకూ మూడో సారి ఇలాంటి ప్రతిష్టాత్మకమైన ఎన్‌బీఏ గుర్తింపు కళాశాలకు దక్కినట్లు తెలిపారు. ఈ విజయంలో తమకు సహకరించిన అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి అభినందనలు తెలిపారు. కళాశాల కార్యదర్శి కోయి శేఖర్ మాట్లాడుతూ.. జాతీయ సంస్థలు తమ కళాశాలకు ఇస్తున్న గుర్తింపు తమ కళాశాల నాణ్యతా ప్రమాణాలకు ప్రతీక అని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్టీఆర్ స్టేడియం ఎన్నికల నామినేషన్ల స్వీకరణ

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గ ఎన్నికల నామినేషన్లను బుధవారం నుంచి ఆగస్టు ఒకటో తేదీ వరకు స్వీకరించనున్నట్లు ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గ ఎన్నికల నిర్వహణ అధికారి డి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఎన్నికల షెడ్యులును కార్పొరేషన్ చాంబర్ లో విడుదల చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని చెప్పారు. ఆగస్టు 2న ఉదయం 9 గంటలకు అభ్యర్థుల జాబితా ప్రదర్శన, ఆగస్టు 4వ తేదీ నామినేషన్ల పరిశీలన ఉంటుందని చెప్పారు. అనంతరం పోటీల ఉన్న అభ్యర్థుల ప్రకటన చేయనున్నట్లు వివరించారు. ఆగస్టు 5న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు ఉపసంహరణ గడవు ఉందని చెప్పారు. ఆగస్టు 18న ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత కౌంటింగ్ నిర్వహించి, ఫలితాలను వెల్లడించనున్నట్లు వివరించారు.

ఒకటి నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం



స్వచ్ఛ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, మేయర్ రవీంద్ర

నెహ్రూనగర్: నగరాన్ని సుందర, పర్యావరణహిత నగరంగా, ప్రజారోగ్యాన్ని కాపాడుకునేందుకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించకుండా వ్యాపార వాణిజ్య సంస్థలు, ప్రజలు ముందుకు రావాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలసి మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో చాంబర్ ఆఫ్ కామర్స్, హోటల్స్, రెస్టారెంట్ల యజమానులు, కర్రి పాయింట్స్, ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్స్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరుని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం సంపూర్ణంగా నిషేదించిన నగరంగా తీర్చి దిద్దుకోవడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తామని, చుట్టుపక్కల ప్రజలు, మిత్రులకు అవగాహన కల్పిస్తామని స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, బి.శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జ్ ఎంహెచ్ఓలు రామారావు, సోమశేఖర్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రూ.21 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం



అంశాలను చర్చిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలో సుమారు రూ.21 కోట్లతో పలు డివిజన్లలో అభివృద్ధి పనులను నిర్వహణకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపిందని కమిటీ అధ్యక్షులు, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. మంగళవారం స్టాండింగ్ కమిటీ సమావేశం మేయర్ చాంబర్‌లో నిర్వహించారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, స్టాండింగ్ కమిటీ సభ్యులు హాజరయ్యారు. 63 అంశాలకు సంబంధించిన అభివృద్ధి పనులను విపులంగా చర్చించి ఆమోదం తెలిపారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ ఆదాయానికి నగర పాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఖాళీలు ఉన్న వాటికి నిబంధనల ప్రకారం బహిరంగ వేలం నిర్వహించి, షాపులను కేటాయించనున్నటుపేర్కొన్నారు. సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, దాసరి లక్ష్మీదుర్గ, ముప్పవరపు భారతి, సెక్రటరీ బి.శ్రీనివాసరావు, డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

గంట వ్యవధిలోనే తప్పిపోయిన బాలిక ఆచూకి



అదృశ్యమైన బాలికను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు

లక్ష్మీపురం: తొమ్మిదేళ్ల బాలిక అదృశ్యమైన గంట వ్యవధిలోనే సీసీ కెమెరాల సహాయంతో బాలిక ఆచూకిని గుర్తించి, కుటుంబ సభ్యులకు అప్పగించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. ఉదయం 7 గంటల సమయంలో కోబాల్డ్‌పేట 6వ లైన్‌కు చెందిన బలస శిరిషా కుమార్తె ఇంట్లో నుంచి బయటకు వెళ్లి దారి మరిచిపోయింది. దీంతో ఎంతకు ఇంటికి రాక పోవడంతో శిరిషా ఆమె తల్లిదండ్రులు, స్థానికులు పాపను వెతుకలాడారు. ఎంతకు ఆచూకి తెలియక పోవడంతో పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన మరుక్షణమే పట్టాభిపురం సీఐ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి చుట్టు పక్కల గాలింపు చేపట్టారు. కోబాల్డ్‌పేట 6వ లైన్ నుంచి బయటకు వెళ్లిన పాపను చుట్టు పక్కల నివాసాలల్లో ఉన్న సీసీ కెమెరాల సహాయంతో బ్రాడీపేట వైపు వెళ్లినట్లు గుర్తించి గాలించగా బ్రాడీపేటలోని పీకల వాగు సమీప ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు. తక్షణమే పాపను పట్టాభిపురం స్టేషన్‌కు తరలించి బాలిక కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మహనీయుల విగ్రహాల ముందు ఫ్లెక్సీలతో ప్రచారం బాధాకరం

లక్ష్మీపురం: మహనీయుల విగ్రహాల ముందు ప్రచారాల కోసం ఫ్లెక్సీలు అడ్డుపెట్టడం చాలా దారుణమని ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు షేక్ కరీం అన్నారు. మంగళవారం గుంటూరు నగరంపాలెంలోని మూడు బొమ్మల సెంటర్‌లో జవహర్ లాల్ నెహ్రూ, ప్రధాన మంత్రి దివంగత ఇందిరాగాంధీ, వంగవీటి మోహన్ రంగా విగ్రహాల ముందు జిల్లా ఎన్‌జీఓ అసోసియేషన్ పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ఫ్లెక్సీలతో వాళ్ళ ప్రచారం కోసం దేశ నాయకుల విగ్రహాలను పూర్తిగా మూసి వేసే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుంటే నగరపాలక సంస్థ కళ్ళు మూసుకునే వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లెక్సీలను తొలిగించాలని కమిషనర్‌ను కోరిన విషయం సోషల్ మీడియాలో వైరల్ అయి దుమారం లేపింది. దీంతో మంగళవారం సాయంత్రానికి నగరపాలక సంస్థ అధికారులు స్పందించి ఫ్లెక్సీలను తొలిగించారు. ఎన్‌యుఐ విద్యార్థి విభాగం మహనీయుల విగ్రహాలకు పూల మాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు మదన్, తిరుమల రావు, రవి, గౌతమ్, నాగూర్, మోషేయ్, ధైయు, రాఖీ, మని, నాని, అబ్బాస్ పాల్గొన్నారు